నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, ఆదివారం 1 జూన్ 2025 SIDDIPET


# కాళేశ్వరం గొప్పతనం కాంగ్రెసోళ్లకు తెలియదు

- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణకు మేలు జరిగింది
- మంత్రి ఉత్తమ్ మాటలు గర్హనీయం
- కేసీఆర్ పాలనలో గంగపుత్రులకు పెద్దపీట
- రేవంత్ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 31: కేసీఆర్ పాలనలో గంగపుత్రుల అభివృద్ధికి రూ. 1000 కోట్లు ఖర్చు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రుల అభివృద్ధికి రూపాయి నిధులు ఖర్చుచేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ లో గంగమ్మ దేవాలయం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మత్స్యకారులకు లూనాలు, ఆటోలు, ఐస్ బాక్సులు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. కాలమైనా కాకపోయినా చెరువులను కాళేశ్వరం నీటితో చెరువులు నింపామని, యాసంగి పంటలు అయిపోయినా రాఘవాపూర్ చెరువు నీటితో నిండుగా ఉందని, ఇది కేసీఆర్ కృషి ఫలితం అన్నారు. కొంతమంది హైదరాబాదులో కూర్చుని కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి జ్ఞానం ఉందో లేదో తెలియదని.. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరం పారలేదని ఆయన అనడం విచిత్రంగా ఉందని హరీశ్‌రావు విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రంగనాయక సాగర్ నుంచి ఇక్కడి పొలాలకు నీళ్లు వచ్చింది వాస్తవమా కాదా మంత్రి చెప్పాలన్నారు. కాళేశ్వరం లేకుంటే రాఘవపూర్ చెరువులో నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని మంత్రి ఉత్తమ్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ అన్నివర్గాల ప్రజలకు ప్రాధాన్యతమిస్తూ బతుకుదెరువు చూపిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను ఆగంజేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాజెక్టులు, చెరువుల్లో సకాలంలో చేప పిల్లలు పోసేటోళ్లమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చేప పిల్లల పంపిణీ ఊసేలేదన్నారు. నేడు గ్రామాల్లో ప్రజల చేతిలో పైసలు లేని పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు ఉన్నప్పుడు ఏటా రెండు పంటలకు సకాలంలో రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ చేశామని, రేవంత్ ప్రభుత్వం రైతుభరోసా ఎగ్గొట్టిందని విమర్శించారు. రుణమాఫీ సగం మంది రైతులకు కాలేదని, దవాఖానలో కేసీఆర్ కిట్టు బంద్ అయిందని, ఆసరా పింఛన్లు రెండు నెలలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. కేసీఆర్ లేని లోటును ప్రజలు గమనిస్తున్నారని, రేవంత్ పాలనలో భూముల రేట్లు చాలా తగ్గిపోయాయని, రాబోయే కాలంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులు చనిపోతే బీమా ఇవ్వడం లేదన్నారు. రైతుబీమా బీమా ప్రీమియం నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉందన్నారు. బూతులు తిట్టడం తప్ప ఈ సీఎం ప్రజలకు పనికి వచ్చే ఏ ఒక్క పని చేశాడని ఎద్దేవా చేశారు. రాఘవాపూర్ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవీచందర్ రావు, మాజీ సర్పంచ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో పల్లెల్లో ప్రగతి


సమీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- కాంగ్రెస్ పాలనలో చెత్తకుప్పలు
- పంచాయతీలకు అప్పులు
- గ్రామాల అభివృద్ధిపై సమీక్షలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 31: బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు ప్రగతి పథంలో పరుగులు తీశాయని, కాంగ్రెస్ సర్కారు వచ్చాక పల్లెల్లో ప్రగతి కుంటుపడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూరు, నంగునూరు మండలాల్లోని గ్రామాల అభివృద్ధిపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో అనేక గ్రామాలు అవార్డులు సాధించాయని, నేడు అవార్డుల్లో గ్రామాలు వెనుకంజలో ఉండడం బాధాకరం అన్నారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎష్ ప్రభుత్వం ప్రతినెలా రూ. 275 కోట్లు, ఏటా రూ.3330 కోట్ల నిధులు ఇచ్చినట్లు గుర్తుచేశారు. నేడు పల్లెల్లో పారిశుధ్యం లోపించి చెత్త కుప్పలుగా దర్శనమిస్తున్నాయని, మరోవైపు పంచాయతీలు అప్పుల ఊబిలో కూరుకుపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీల పాలన గాడి తప్పిందని, అధికారులు దృష్టి పెట్టి అభివృద్ధి పనులు కొనసాగించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

**అవార్డులు వచ్చేలా చొరవ చూపాలి...**

సిద్దిపేట నియోజకవర్గం అంటేనే ఆదర్శ గ్రామాలకు, అవార్డులకు పెట్టింది పేరు అని హరీశ్‌రావు అన్నారు. నియోజకవర్గంలో 45 అవార్డులు తెచ్చుకున్నామని తెలిపారు, మళ్లీ ఆ దిశగా గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించి ఆదర్శంగా నిలపాలని, పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ ప్రతిరోజు చేపట్టాలని, గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. నర్సరీలు, మొక్కలు నాటేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటి కొరత ఉండకుండా చూడాలని, నిధుల కొరత ఉంటే తన దృష్టికి తేవాలని అధికారులకు హరీశ్‌రావు సూచించారు.

# జీలుగ విత్తనాల కోసం రైతులకు ఇక్కట్లు


సిద్దిపేట జిల్లా చెప్యాల-అల్వాల క్రాస్‌రోడ్డులో జీలుగ విత్తనాల కోసం వచ్చిన రైతులు

మిరుదొడ్డి, మే 31: జీలుగ విత్తనాల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా చెప్యాల-అల్వాల క్రాస్ రోడ్డులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులు జీలుగ విత్తనాల కొనుగోలుకు వెళ్లగా, కొందరికే విత్తనాలు అందడంతో మిగతా రైతులకు అందక నిరాశకు లోనయ్యారు. వానకాలం సీజన్ వచ్చినప్పటికీ జీలుగ విత్తనాలు రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేయడంపై రైతులు మండిపడ్డారు. సరిపడా జీలుగ విత్తనాలను సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# బడిబస్సు భద్రమేనా!





## ఫిట్‌నెస్ పరీక్ష చేయించడంలో యాజమాన్యాల నిర్లక్ష్యం

- అడ్మిషన్లపై ఉన్న శ్రద్ధ బస్సుల భద్రతపై లేదు.. ఏటా ప్రమాదాలు జరుగుతున్నా మారని తీరు
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం కఠినంగా వ్యవహరించని ఆర్టీఏ అధికారులు
- ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు
- సమీపిస్తున్న గడువు.. ఇప్పటికే 40 శాతం బస్సులకే పూర్తి

సిద్దిపేట, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): విద్యాసంస్థలు జూన్ 12 నుంచి పున:ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభం కాకముందే స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిచేయాలి. సంగారెడ్డి జిల్లాలో 1461, సిద్దిపేట జిల్లాలో 381, మెదక్ జిల్లాలో 170 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం 40శాతం బస్సులకు మాత్రమే సామర్థ్య పరీక్షలు నిర్వహణ పూర్తి అయ్యింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బస్సుల ఫిట్‌నెస్ సరిగా లేక పోవడంతో గతంలో ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. బస్సుల కండీషన్‌గా ఉంచాల్సిన బాధ్యత ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలదే. కానీ, వారు అడ్మిషన్‌లపై ఉన్న శ్రద్ధ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై చూపించడం లేదన్న విమర్శలున్నాయి. అడ్మిషన్లు, స్కూల్ బస్సు ఫీజుల పేరిట దండిగా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కానీ, బడి బస్సులపై శ్రద్ధ చూపించడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరో పది రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభమవుతాయి. ఇంకెప్పుడు ఫిట్‌నెస్ పరీక్షలు చేయిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో రవాణా శాఖ(ఆర్టీఏ) అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలని కోరుతున్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కి తక్కువ జీతం ఇచ్చి అనుభవం లేని వారిని డ్రైవర్లుగా నియమించుకుంటున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు నడపాలంటే డ్రైవర్‌కు కనీసం ఐదేండ్ల అనుభవం ఉండి తీరాల్సిందే. అతడి లైసెన్స్ చెక్ చేయాలి. ఏటా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ చెక్ చేయాలి. రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ, ఇతర ధ్రువీకరణ పత్రాలు సరిగా ఉండాలి. బస్సు పదిహేను సంవత్సరాలు దాటితే స్కూల్‌కు వాడరాదు. కానీ, కాలం చెల్లిన పాత బస్సులకు రంగులు అద్ది ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తే విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడినట్టే అవుతుంది. కాబట్టి ఈ విషయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు లొంగకుండా ఆర్టీఏ అధికారులు కఠినంగా వ్యవహరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆర్టీఏ అధికారులు కఠినంగా వ్యవహరించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయడంతో పాటు అనుభవం లేని డ్రైవర్ల నియామకంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**సామర్థ్య పరీక్షలు తప్పనిసరి...**

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా ఆర్టీఏ జిల్లా శాఖల పరిధిలో పాఠశాలల, కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతున్నాయి. కానీ, కొన్ని విద్యాసంస్థలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. వీరికి ఆర్టీఏ శాఖలోని కొంతమంది సిబ్బంది వంత పాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలం చెల్లిన వాహనాలకు రంగులు అద్ది తూతూమంత్రంగా పరీక్షలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 1461 బస్సులు, సిద్దిపేట జిల్లాలో 381, మెదక్ జిల్లాలో 170 స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడం తప్పనిసరి. కానీ, ఇంత వరకు 40శాతం బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేశారు. ఫిట్‌నెస్ పరీక్షలు జూన్ 12లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్ దాటాక ఆ బస్సులను నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు స్కూల్ గుర్తింపు రద్దు చేసే అవకాశం ఉంది. కానీ, అలా ఎక్కడా జరిగిన సందర్భాలు లేవు. బడి బస్సుల్లో కనీస సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రధానంగా అత్యవసర ద్వారం, మంటలు ఆర్పే పరికరాలు, ప్రథమ చికిత్స కిట్, అత్యవసర సమయంలో బయటకు వెళ్లేందుకు పగలగొట్టే గ్లాస్, కిటికీల వద్ద ఇనుప గ్రిల్స్, ఫైర్ అలారం, మంటలు ఆర్పే స్ప్రే ఉండాలి. ఇవికాకుండా పిల్లలు పట్టుకునే విధంగా నిలువు రాడ్లు ఏర్పాటు చేయాలి. ముందు, వెనుక భాగాల్లో లైట్లు, ఇండికేటర్లు, అద్దాలు ఉండాలి. తలుపుల వద్ద లాకింగ్ సిస్టం, పిల్లలు ఎక్కేందుకు వీలుగా ఫుట్‌బోర్డు పటిష్టంగా ఉండాలి. ఇలా ప్రతి ఒక్కటి బస్సులో ఉండాల్సిందే.

| జిల్లాల వారీగా స్కూల్ బస్సులు | సంగారెడ్డి జిల్లా | సిద్దిపేట జిల్లా | మెదక్ జిల్లా |
|---|---|---|---|
| | 1461 | 381 | 170 |


ఎల్లమ్మగూడలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

# ప్రొటోకాల్ విస్మరించిన కాంగ్రెస్ నేతలు

హత్నూర,మే 31: మండలంలోని ఎల్లమ్మగూడలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల భూమిపూజలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి పోటాపోటీగా పాల్గొనడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎల్లమ్మ గూడలో శనివారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయులు తమ నాయకులను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమిపూజ కోసం ఆహ్వానించారు.కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి,మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తమ వర్గ మండల స్థాయి నాయకులతో ముందుగా ఎల్లమ్మగూడకు చేరుకుని ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గ్రామానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే అయిన తనను కాదని, ప్రొటోకాల్ విస్మరించి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరికొకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఎస్సై శ్రీధర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో ఇరువర్గాలకు నచ్చచెప్పి శాంతింపజేశారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- సమావేశంలో మాట్లాడని మంత్రి దామోదర
- మంత్రి కొండా సురేఖ తీరే కారణమని గుసగుసలు

సంగారెడ్డి, మే 31 (నమస్తే తెలంగాణ): వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వానకాలం సాగు ప్రణాళిక, భూభారతి చట్టం అమలు, సంక్షేమ పథకాల అమలును సమీక్షించారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్ రాజ్, మనుచౌదరి జిల్లాల వారిగా వివరాలు మంత్రులకు తెలియజేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ.. చివరి గింజ వరకూ ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. అర్హులకు పథకాలు వర్తింపజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లక్ష్యం మేర పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామని, మరో 20శాతం ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం అంగీకరించినట్లు చెప్పారు. వానకాలం సీజన్‌కు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. తాగునీరు, కరెంటు సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. భూభారతి చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. కాగా, ఈ కీలక సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఒక్క మాట మాట్లాడలేదు. ఇందుకు మంత్రి కొండాసురేఖ వైఖరి కారణమని తెలుస్తుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ మధ్య కొంతకాలంగా పొసగడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహణ తేదీ, స్థలం తనకు ముందస్తుగా చెప్పకుండానే కొండా సురేఖ ఖరారు చేయడంపై మంత్రి దామోదర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆమేరకు ఏర్పాట్లు జరిగిపోయాయి. మంత్రి దామోదర ఒత్తిడి మేరకు సమావేశం తేదీ, వేదిక మారినట్లు తెలుస్తుంది. మంత్రి దామోదర త్వరలోనే మెదక్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, అధికారులతో పోటీగా మరో సమీక్షా సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

**డ్రోన్ పంపిణీ చేసిన మంత్రులు**

అందోల్ మండలం అన్నసాగర్ డ్రోన్ దీదీలకు మంత్రులు దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ మొదటిడ్రోన్‌ను అందజేశారు. నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న 57 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు సబ్సిడీపై డ్రోన్‌ల పంపిణీని మంత్రులు ప్రారంభించారు. 57 మంది మహిళలకు డ్రోన్‌లు అందజేయాల్సి ఉండగా, మొదటి విడతలో 26 డ్రోన్‌లు, శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళలకు డ్రోన్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు.



సంగారెడ్డిలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, పక్కనే మంత్రి దామోదర్ రాజనర్సింహ

# ఘనచరిత్ర బీఆర్‌ఎస్ సొంతం

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 31: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘన చరిత్ర బీఆర్‌ఎస్ సొంతమని, అతిపెద్ద బహిరంగ సభలు నిర్వహించిన ఘనత కేసీఆర్‌కే చెల్లిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సమాజం మొత్తం మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, భారత రాష్ట్ర సమితి రజతోత్సవ వేడుకల్లో భాగంగా జూన్ 1న జరిగే ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసేందుకు డల్లాస్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన శంఖారావం సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారని గుర్తుచేశారు. కరీంనగర్ శంఖారావం సభ దేశ చరిత్రలో నాటి ఉమ్మడి రాష్ట్రంలో అతిపెద్ద సభగా విజయవంతమైందని పేర్కొన్నారు. గతనెలలో ఎల్కతుర్తిలో జరిగిన సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారని, సభకు రాలేకపోయిన లక్షలాది మంది జనం రోడ్ల పైన ఉండగా.. ఎంతోమంది టీవీలో సభను వీక్షించినట్లు గుర్తుచేశారు. ఎల్కతుర్తి సభ స్ఫూర్తితో డల్లాస్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్ గమ్యాన్ని ముద్దాడారని, బీఆర్‌ఎస్ హయాంలో పదేండ్ల పాలనలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకున్నట్లు తెలిపారు. తాగు, సాగు నీరు వెతలు తీర్చారని, రియల్ వ్యాపారం ఎంతో వృద్ధి చెందిందని, సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టి కేసీఆర్ తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నేటి డల్లాస్ సభ విజయవంతానికి బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ మంత్రి ఇటీవల ఓ సర్వే చేయించారని, 12 అసెంబ్లీ స్థానాలకు 12 సీట్లను బీఆర్‌ఎస్ పార్టీ గెలవబోతుందనే విషయం సర్వేలో తెలిసిందన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు త్వరలోనే టెండర్లు

రామాయంపేట, మే 31: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని రాష్ట్ర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలో శనివారం సర్వే నెంబర్ 1421లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణా స్థలాన్ని ఆయన పరిశీలించారు. రెసిడెన్షియల్ స్కూల్‌కు ఈ స్థలం అనువుగా ఉందన్నారు. వారి వెంట ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ నర్సింహ్మాచారి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ గౌస్, సుప్రభాతరావు ఉన్నారు.


రోయింగ్ పోటీల్లో కాశబోయిన అభిజిత్ యాదవ్ బృందం

# రోయింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్

- మే 27 నుంచి 31 వరకు హుస్సేన్ సాగర్‌లో జరిగిన పోటీలు
- పాల్గొన్న 27 రాష్ట్రాల క్రీడాకారులు

హుస్నాబాద్ టౌన్, మే31: జాతీయస్థాయి 26వ సబ్ జూనియర్ రోయింగ్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన కాశబోయిన అభిజిత్‌యాదవ్ బృందం గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. మే 27 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో రోయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో 25 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. కాశబోయిన అభిజిత్‌యాదవ్‌తో కూడిన నలుగురు బృందం పాల్గొన్న పోటీలో గోల్డ్ మెడల్ సాధించగా, డబుల్స్‌లో సైతం అభిజిత్‌యాదవ్ టీం సిల్వర్ మెడల్స్‌ను సాధించింది. తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ మిథున్‌రెడ్డి మెడల్స్‌ను బహూకరించారు. మాజీ కౌన్సిలర్ కాశబోయిన లలిత, మురళి దంపతుల కుమారుడు అభిజిత్ యాదవ్ బృందాన్ని జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అభినందించారు.